జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 7-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 361 పేజీలు: 4 వెల: రూ.7

## బాలాజీ ఎగ్‌సెంటర్..
# పేరు గుడ్డుది.. వ్యవహారం కోట్లది!




*** రెండు మూడు గొడౌన్లలో అక్రమ నిల్వలు * నిబంధనలు పాటించని నిర్వాహకులు * మరి జీఎస్టీ ఏది? * పట్టించుకోని మున్సిపాలిటీ, ఫుడ్ సేఫ్టీ, జీఎస్టీ అధికారులు**

**శ్రీకాకుళం, జూన్ 6 (వార్త):** శ్రీకాకుళం కళింగ రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న 'బాలాజీ ఎగ్ సెంటర్' పేరుకు మాత్రమే గుడ్ల దుకాణం. కానీ ఇక్కడ జరుగుతున్న వ్యాపారం చూస్తే ఆశ్చర్యపోతారు. గుడ్లతో పాటు, చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు, అప్పడాలు, వడియాలు, పానీయాలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ వంటి ఎన్నో తినుబండారాలను హోల్‌సేల్‌గా విక్రయిస్తూ మినీ సూపర్ మార్కెట్‌ను తలపిస్తోంది. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ భారీ వ్యాపారానికి గుడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) వర్తించడం లేదు.

### కోట్ల టర్నోవర్.. జీఎస్టీ, ప్రకటన పన్ను గల్లంతు!

బాలాజీ ఎగ్ సెంటర్ కేవలం గుడ్ల విక్రయం ద్వారానే రోజుకు 300 అట్టల గుడ్లను అమ్ముతూ, దాదాపు రూ. 3,000 లాభం సంపాదిస్తున్నట్లు సమాచారం. దీని ప్రకారం, నెలకు లక్ష రూపాయలు, సంవత్సరానికి రూ. 12 లక్షల ఆదాయం కేవలం గుడ్ల నుంచే వస్తోంది. మిగిలిన తినుబండారాల వ్యాపారాన్ని కలిపితే , ఈ షాపు టర్నోవర్ అనేక కోట్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ వ్యాపారిపై ఎటువంటి పన్ను వ్యవస్థ లేకపోవడం విచిత్రం. షాపు బోర్డుపై 'జీఎస్టీ..' అని రాసి, పక్కన నంబరు లేకుండా ఖాళీగా వదిలేశారు. అంతేకాదు, మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.460 ప్రకటన పన్నును కూడా కట్టకుండా బోర్డునే తీసేశారని తెలిసింది.

### అక్రమాలకు అడ్డా.. సరఫరాదారుల చిట్టా, గోడౌన్ల రహస్యం

ఈ షాపుకు సరుకులు కావ్య ఏజెన్సీస్, కొత్తూరు శబరి ట్రేడర్స్, ఎల్.ఎన్.పేటలోని విశాఖ గ్లూకోజ్ కేంద్రం వంటి ఏజెన్సీల నుండి హోల్‌సేల్‌గా వస్తున్నాయి. ఈ సరఫరా వ్యవస్థపై అధికారులు దృష్టి సారించడం ద్వారా ఈ వ్యాపారి అక్రమాలు మరింత బయటపడే అవకాశం ఉంది. బాలాజీ ఎగ్ సెంటర్ నిర్వాహకుడు చిత్తరంజన్ వీధిలో తన ఇంట్లోనే ఒక గోడౌన్‌ను, పెద్ద బరాటం వీధిలో మరో గోడౌన్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం. వీటిలో అక్రమంగా స్టాకు నిల్వ చేయడం, పన్నుల మళ్లింపు, లైసెన్స్ లేని విక్రయాలు వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నా, ఇప్పటివరకు ఎటువంటి అధికారుల దృష్టికీ రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### సర్కారు కన్ను ఎప్పుడు పడుతుందో?

ప్రధాన రహదారిపై, పోలీస్ కార్యాలయానికి ఎదురుగా ఇంత పెద్ద అక్రమ వ్యాపారం నిరాటంకంగా సాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత పన్ను శాఖ, మున్సిపాలిటీ, ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్, జీఎస్టీ అధికారులు ఈ దుకాణంపై తక్షణమే దృష్టి సారించి, తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. గుడ్డు పేరుతో జరుగుతున్న ఈ కోట్ల రూపాయల అక్రమ వ్యాపారంపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



## కుమార్తెకు..
# తలకొరివి పెట్టిన తల్లి

*** తండ్రి ఐసీయూలో * ఆమదాలవలసలో హృదయ విదారక ఘటన * కడసారి చిన్నారిని చూసేందుకు తరలివచ్చిన కాలనీ వాసులు * కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు**

**ఆమదాలవలస, జూన్ 6 (వార్త):** తండ్రి ఉన్నా.. కన్న తల్లే ఆడబిడ్డకు తలకొరివి పెట్టాల్సిన హృదయ విదారక ఘటన ఆమదాలవలస పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఆమదాలవలస మున్సిపాలిటీ 14వ వార్డు ఐజే నాయుడు కాలనీకి చెందిన కాయల కాళిదాసుకు భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు కె.కేతన, కె.నక్షత్ర ఉన్నారు. కాళిదాసు శ్రీకాకుళం రిమ్స్‌లో కొన్నాళ్ల కిందట అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీలో పని చేసేవాడు. ఈ మధ్యకాలంలో ఒక ప్రమాదానికి గురవడంతో ఆ ఉద్యోగం చేసే పరిస్థితి లేక భార్య రాజేశ్వరి ఆ విధులను నిర్వహిస్తూ కాయ కష్టంపై కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు పిల్లలు స్థానిక భవిత స్కూల్‌లో 6వ తరగతి, రెండో తరగతి చదువుతున్నారు. కేతనకు ఆరోగ్యపరమైన సమస్య ఉండడంతో ప్రతి నెలా రాజాంలోని ఆసుపత్రికి మందుల కోసం వెళ్తుతుంటారు. ఎప్పటిలాగే కాళిదాసు తన పెద్ద కుమార్తె కేతనతో స్కూటీపై రాజాం గురువారం బయలుదేరాడు. బూర్జ మండలం గుత్తావల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతన ప్రమాద ఘటనలోనే దుర్మరణం చెందగా.. కాళిదాసు తీవ్రంగా గాయపడ్డాడు. కాళిదాసును చికిత్స నిమిత్తం రాగోలులోనే జెమ్స్ ఆసుపత్రికి తరలించగా ఐసీయూలో ఉన్నాడు. ఈ క్రమంలో చిన్నారి కేతన మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. అయితే తండ్రి ఉన్నా... తలకొరివి పెట్టే స్థితిలో లేకపోవడంతో తల్లి రాజేశ్వరి శుక్రవారం కేతనకు తలకొరివి పెట్టి కన్నీరుమున్నీరైంది. కేతన అంత్యక్రియలకు ఐజే నాయుడు కాలనీవాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, చిన్నారి సహచర విద్యార్థులు, ఉపాధ్యా యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# దోపిడీ ముఠా అరెస్టు

*** హైవేపై ఆగివున్న వాహనాలే వీరి టార్గెట్ * బెదిరించి నగదు, ఫోన్లు దోచుకోవడం వీరి నేరప్రవృత్తి * నిందితులు రాజస్థానీయులు * వారి నుంచి నగదు, ఫోన్లు, మారణాయుధాలు స్వాధీనం * చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు * అభినందించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి**



**శ్రీకాకుళం క్రైం, జూన్6 (వార్త):** శ్రీకాకుళం జిల్లా టెక్కలి, నందిగాం, నరసన్నపేట, లావేరు జాతీయ రహదారిపై రాత్రి వేళలు ఆగి ఉన్న వాహనదారులను బెదిరించి నగదు మొబైల్ ఫోన్ దోచుకుంటున్న ముఠాను అరెస్టు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ముఠా సభ్యులంతా రాజస్థాన్‌కు చెందినవారన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో టెంట్లలో నివాసముంటున్నారని, రాత్రివేళయితే నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బయట ప్రదేశాలలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను కూడా దొంగతనం చేస్తుంటారన్నారు. బొడ్డేపల్లి సతీష్ కుమార్, అతని స్నేహితుడు సేపేన బెనర్జీ మోటార్ సైకిల్ పై నందిగాం మండలం కణితూరు గ్రామం లో వివాహ వేడుక అనంతరం తమ సొంత గ్రామమైన ఆమదాలవలస వస్తుండగా వర్షం కురియడంతో మార్గ మధ్యంలో జాతీయ రహదారిపై టెక్కలి మండలం విక్రంపురం గ్రామ బస్సు స్టాప్ వద్ద ఆగారు. ఈ సమయంలో ఈ ముఠా సభ్యులు వారిని కత్తులతో బెదిరించి డబ్బులు, మొబైల్ ఫోన్‌లు తీసుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ ముఠా సభ్యులు తగరపువలస నుంచి ఇచ్ఛాపురం వరకు గల నేషనల్ హైవే పరిధిలో రాత్రి సమయాలలో ఆగివున్న లారీలు, ఇతర వాహనాల లో నిద్రిస్తున్న డ్రైవర్‌ల వద్ద ఉన్న నగదును, మొబైల్ ఫోన్‌లను గత 3 సంవత్సరాల నుంచి దొంగతనం చేస్తున్నారన్నారు. గత 6 నెలలుగా, రాత్రి సమయాలలో కత్తులు పట్టుకుని నేషనల్ హైవే పరిధిలో రాత్రి సమయాలలో ఆగివున్న వాహనాలకు వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు వీరిపై కన్నేయడంతో పట్టుబడ్డారన్నారు. మరో కేసుకు సంబంధించి ఇద్దరు నిందితుల నుంచి మూడు తులాల బంగారం, 11 తులాల వెండి ఆభరణాలు, 15 ద్విచక్రవాహనాలకు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. సారవకోట, జలుమూరు,నరసన్నపేట, ఎచ్చెర్ల, లావేరు జే.ఆర్.పురం, శ్రీకాకుళం 2 టౌన్, విజయనగరం జిల్లా డెంకాడ పోలీసు స్టేషన్ల పరిధిలో నేరాలు చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నామన్నారు. కొర్ల శివ, ఎ.మున్నాలు ఈ చోరీలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఆ ఇద్దరూ సారవకోట మండలం బుడితి జంక్షన్ వద్ద పట్టుబడ్డారు. ఇంకో కేసుకు సంబంధించి ద్విచక్రవాహనాలు దొంగతనం చేస్తున్న బసవ సుధాకరరెడ్డిని శ్రీకాకుళం రూరల్ పోలీసులు పట్టుకున్నారని, అతని నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడం, కేసు ప్రాపర్టీ రికవరీ చేయడంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించి కేసు ఛేదించడంలో ప్రతిభా కనబరిచిన నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు, సారవకోట ఎస్ఐ అనిల్, సిబ్బంది, శ్రీకాకుళం రూరల్ ఎస్సైతో పాటు సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎం.సూర్య చంద్ర మౌళి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి శ్రీనివాసరావు, సీఐలు ఇమాన్యుల్ రాజు, పైడపు నాయుడు, సూర్యచంద్రమౌళి, విజయ్ కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.





# పరిహారానికి.. పడిగాపులు

*** నగదు ఇవ్వకుండానే పనులు**
*** ఆందోళనలో బాధితులు**

**సంతబొమ్మాళి, జూన్ 6(వార్త):** మూలపేట పోర్టు రోడ్డు కోసం ఇంటి స్థలాలు పోగొట్టుకోనున్న బాధితులు పరిహారం కోసం మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అధికారులు, రాజకీయ నేతల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వివరాల్లోకి వెళితే.. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు దారి నిర్మాణానికి నౌపడ మూడు రోడ్ల జంక్షన్ వద్ద బాధితులు చిక్కాల శ్రీకాంత్, సాహుకారి అప్పలరాజు, మహంతి సుధా, నడిమింటి బాబురావు, మహంతి సోమేశ్వరరావు, మహంతి నాగభూషణ్ ల ఇళ్ల స్థలాల భూ సేకరణ చేస్తున్నట్లు అధికారులు సంతకాలు తీసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం మాత్రం ఇవ్వకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సబ్ కలెక్టర్‌లు, రెవెన్యూ అధికారులు పలుమార్లు వచ్చి కొలతలు తీసుకున్నారే తప్ప పరిహారం మాత్రం ఇవ్వలేదని బాధితులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించిన అధికారులు తమకు మాత్రం పరిహారం అందించడంలో అధికారులు చొరవ చూపడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పోర్టు పనులకు సంబంధించిన మిషనరీ తమ ఇళ్ల స్థలాలలో జంగిల్ క్లియరెన్స్ చేయగా తాము అడ్డుకున్నామని పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని తెలిపామని బాధితులు అన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు పరిహారం కోసం వేడుకున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రిటైర్డ్ హెూంగార్డుకు చేయూత



**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు బిడ్డుక అప్పలస్వామికి చేయూతగా సుమారు రూ.4.03 లక్షల చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి శుక్రవారం అందజేశారు. సమస్య ఉంటే తనను సంప్రదించాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐ హరినాథ్, హెూం గార్డు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.




## నూతన టీవీసీతో ఆశీర్వాద్ ఆటా

(శ్రీకాకుళం)

భారతదేశపు ప్రముఖ గోధుమ పిండి బ్రాండ్ గా పేరు గాంచిన ఆశీర్వాద్ ఆటా దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌ల్లో 'క్వాలిటీ సర్టిఫికెట్' ప్రారంభంతో 'నాణ్యతహామీ'ని పునర్నిర్వచిస్తోందని ఐటీసీ ఫుడ్స్ స్టేపుల్స్ అండ్ అడ్జసెన్సీస్ అధికారి అనుజ్ కుమార్ రుస్తగి తెలిపారు. శుక్రవారం ఆయన 'నాణ్యత హామీ పేరుతో నూతన టీవీసీని విడుదల చేసి, మాట్లాడారు. ఆశీర్వాద్ తమ దీర్ఘకాల సంబంధంతో ప్రసిద్ధి నటీమణి స్నేహాను తమ బ్రాండ్ అంబాసిడర్ గా పునః పరిచయం చేసిందన్నారు. దక్షిణ భారతదేశం అంతటా చాలా కుటుంబాల్లో సర్వ సాధారణంగా ఉపయోగించే పదార్థం ఆటా కాబట్టి, తమ కుటుంబం కోసం ఉత్తమమైన ఉత్పత్తిని ప్రజలు ఎంపిక చేయడాన్ని నిర్ధారించడానికి సేకరణ నుంచి ప్యాకేజింగ్ వరకు వివిధ నాణ్యతా ప్రమాణాలను నెరవేర్చే సరైన ఉత్పత్తిని ఎంచుకోవడం తప్పనిసరి అన్నారు. ఆశీర్వాద్ ఎల్లప్పుడూ తమ వినియోగదారులకు రాజీలేని నాణ్యతను అందిస్తుందని, కానీ వినియోగదారులకు చాలా ఎంపికలు ఉన్న కారణంగా, ప్రతి ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్యాక్ ఇప్పుడు క్వాలిటీ సర్టిఫికెట్ తో అందజేస్తున్నామన్నారు. ఇది తన నాణ్యతా ప్రమాణాల గురించి రాతపూర్వకమైన హామీని, నాణ్యతను నిర్ధారించడానికి రోజూ నిర్వహించే పరీక్షల వివరాలను అందిస్తుందని చెప్పారు. ఆశీర్వాద్‌తో శ్రేష్టతకు హామీ చేకూరడమే కాకుండా భరోసా కూడా ఇవ్వబడుతుందని,గింజ నుంచి ఆటా వరకు శ్రేష్టత ప్రయాణాన్ని ప్రధానాంశంగా చూపించే పలు అంశాలను సర్టిఫికెట్ తెలియ చేస్తుందన్నారు. గోధుమపిండి స్వచ్ఛత 100 శాతం, 0 శాతం మైదా కలిగి ఉండి, పోష కాహార విలువలు, ఫైబర్ ప్రోటీన్‌తో ఆశీర్వాద్ వారి 'క్వాలిటీ సర్టిఫికెట్' తెలియచేస్తుందని, ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్రతి ప్యాక్ ఉత్తమమైన పద్ధతులు రూపొందించబడుతుందని తెలిపారు.

# శిశుగృహంలో నూతన సదుపాయాల ప్రారంభం





**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** శ్రీకాకుళంలోని శిశు గృహం, బాలసదనంలో క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్, సిక్ రూమ్, రెండు పోషణ వాటికలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పిల్లలతో ముచ్చటించి, వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. శిశుగృహ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, శాఖాధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీసీపీవో రమణ, మోడల్ ఆఫీసర్ పుణ్యవతి, శిశుగృహ మేనేజర్ నరేష్, ఐసీపీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెలుగు కార్యాలయానికి.. బోర్డు పెట్టారు!

**-జాతీయ వార్త కథనానికి స్పందన**




**సరుబుజ్జిలి, జూన్ 6(వార్త):** జాతీయ వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆ మేరకు చర్యలు చేపట్టారు. సరుబుజ్జిలిలోని వెలుగు కార్యాలయానికి నాలుగేళ్లుగా నామ ఫలకం లేకపోవడంపై మే23న 'పేరు లేని భవనమిది' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై ఎట్టకేలకు స్పందించిన అధికారులు.. కార్యాలయ భవనంపై మహిళా సమాఖ్య కార్యాలయం అని రాయించారు. దీంతో ఆ కార్యాలయానికి వచ్చే సందర్శకులు ఆనందం వ్యక్తం చేశారు.

## అల్లుడు టాక్స్ నిరూపిస్తే..
# గుండు గీయించుకుంటా

**- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్**

**పలాస, జూన్ 6(వార్త):** చింత చచ్చినా పులుపు చావదన్న చందంలా మాజీ మంత్రి అప్పలరాజు పరిస్థితి



ఉందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన పలాస ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. మందస మండలం నల్లబొడ్లూరు కొండను మింగితే.. నేడు కోర్టులు చుట్టూ తిరుగుతున్నది స్థానిక సర్పంచ్ ఉమాపతి కాదా? అని ప్రశ్నించారు. నువ్వు అధికారంలో ఉన్నప్పుడు మీ అన్న త్రినాధ్ చేసిన సెటిల్మెంట్ ఆధారాలతో మా వద్ద ఉన్నాయని ఛాలెంజ్ చేశారు. పలాసలో అల్లుడు టాక్స్ నిరూపిస్తే నడిరోడ్డుపై గుండు గీయించుకుంటానని శపథం చేశారు. మరి మీరు చేసిన ఆరోపణలు నిరూపించుకో లేకపోతే... రాజకీయ సన్యాసానికి సిద్ధమా, బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో రైతులకు మభ్యపెట్టి 10% కమీషన్ నువ్వు కొట్టేయలేదా అని ప్రశ్నించారు.

## ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తా

**-శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు.శంకర్**

**-ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ**

**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం నియామకంపై మంత్రి అచ్చెన్న హర్షం



**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు మరో ముందడుగు పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైల్వే జోన్‌కు తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షనీయమన్నారు. పరిపాలనా అనుమతులు పనులు వేగవంతమయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. విశాఖ రైల్వేజోన్‌పై గెజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాట్లు ముమ్మరం

**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** ఉత్తరాంధ్ర చిరకాల కోరిక దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసిందని, అందులో భాగంగా జీఎంగా సందీప్ మాథురిని నియమించారని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ నియామకంతో పనులు, పరిపాలన వ్యవస్థ వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ రైల్వే జోన్‌కు త్వరలో గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలవుతుందన్నారు.

## అసమర్థ పాలనపై ప్రజా తిరుగుబాటు




**పలాస, జూన్ 6(వార్త):** చంద్రబాబు అసమర్థ పాలనపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమే వైసీపీ 'వెన్నుపోటు దినం' నిరసన విజయవంతం కావడం అని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శుక్రవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారం కోసం అమలు చేయలేని హామీలు ఇచ్చి,తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ లేదంటూ సాకులు చెప్పడం కూటమి పాలకులకే చెల్లిందని ఆయన విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను కీలుబొమ్మగా వాడుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేసేలా ముమ్మందు కూడా వైసీపీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టండి



**పలాస, జూన్ 6(వార్త):** మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాలపై స్థానిక కోర్టులో కేసులు నమోదు చేసి పురపాలక సంఘ ఆదాయం మెరుగుపరచాల్సిందిగా కోరారు. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ ఫాసిజాన్ని ప్రతిఘటిద్దాం

**పలాస, జూన్6(వార్త):** విప్లవ సాంస్కృతికోద్యమాన్ని బలోపేతం చేద్దామని, మనువాద కార్పోరేట్ ఫాసిజాన్ని ప్రతిఘటిద్దామంటూ అరుణోదయ శ్రీకాకుళం జిల్లా కమిటీ అధ్యక్షుడు సొర్ర రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో ప్రజా సంఘాలతో కలిసి నిర్వహించిన అరుణోదయ సంస్థల విలీన సభ కరపత్రం ఆవిష్కరించారు. అరుణోదయ సంస్థల విలీనం సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

**-ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ**



**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** బక్రీద్ మత సామరస్యానికి ప్రతీక అని ఎస్పీ మహేశ్వర రెడ్డి అన్నారు. కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

మత, కుల విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులు లేదా వస్తువులు కనబడినా, గోవధ, పశువుల అక్రమ రవాణా సమాచారాన్ని డయల్ 100,112 లేదా స్థానిక పోలీసులకు అందించాలని ఆయన కోరారు.

# యోగాతో ప్రశాంతత.. ఏకాగ్రత



**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** యోగాతో ప్రశాంతత వస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రహదారిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రత, నిశ్చలత వస్తాయన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యా లయ సిబ్బంది, ఆయుష్ నుంచి చంద్రశేఖర్, ఇతర సిబ్బంది, యోగా శిక్షకులు మురళీకృష్ణ, నగర ప్రజలు పాల్గొన్నారు.

**పలాస, జూన్ 6(వార్త):** యోగతో రుగ్మత మాయం చేయవచ్చని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. యోగాంధ్రలో భాగంగా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రతను పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో గ్రంధి వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో వసంత్‌కుమార్, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సరుబుజ్జిలి, జూన్6(వార్త):** యోగాంధ్రలో భాగంగా సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు బాలరాజు, శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో బీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్ ఎలా చేయాలో, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది, ప్రజా ప్రతి నిధులు, ఆశ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## అమ్మ పేరిట మొక్క నాటండి



**పలాస, జూన్ 6(వార్త):** పర్యావరణం పరిరక్షణకు అమ్మ పేరిట ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు కోరారు. శుక్రవారం బీజేపీ నాయకులు పలాసలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలాస మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు పొట్నూరు తారకేశ్వరరావు, సీనియర్ నాయకులు కంచరాన బుజ్జి, మాజీ అధ్యక్షులు వైశ్యరాజ్ మోహన్‌రాజు, టౌన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, గొంటి అప్పారావు, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పైడిభీమవరంలో గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



**రణస్థలం, జూన్ 6(వార్త):** పబ్లిక్ గ్రీవెన్స్‌ను శుక్రవారం పైడిభీమవరం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకుదిటి ఈశ్వరరావు ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఎంపీడీవో, తహసీల్దార్‌కు నివేదించి, పరిష్కరించాలని ఆదేశించారు కార్యక్రమంలో సర్పంచ్ సింక భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, పిన్నింటి భానోజీ నాయడు, పిసిని జగన్నాథం, గొర్లె లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

## ఆవులను వధిస్తే సహించం



**సరుబుజ్జిలి, జూన్6(వార్త):** అక్రమంగా గోవులను తరలించడం, వధించడం చేస్తే సహించేదిలేదని భజరంగ్‌దళ్ సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు గోవిందరావు హెచ్చరించారు. నియమ, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింధూర జలసిరి పరుగులు పెట్టించాలి

**- పలాసకు తాగునీరు అందించడమే లక్ష్యం**

**- సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, జూన్ 6(వార్త):** సింధూర జలసిరి పనులను పరుగులు పెట్టించాలని, మున్సిపాలిటీలో తాగునీరు ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పురపాలక సంఘ భవనంలో శుక్రవారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింధూర జలసరి ద్వారా ప్రస్తుతం పలాస మున్సిపాలిటీలో 60% మందికే నీరు అందు తుందని మిగిలిన వారికి కూడా నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేస్తే, మున్సిపల్ మంత్రిని అడిగి నిధులు తీసుకువస్తామని తెలిపారు. కిడ్నీ హాస్పిటల్ కి కూడా సింధూర జలసిరి ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్, డిప్యూటీ ఈఈ ఆషారాణి. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, సచివాలయాల ఇంజనీరింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉద్దానంలో ఎయిర్‌పోర్ట్ విధ్వంసం కాదా?

**మందస, జూన్ 6(వార్త):** ఉద్దానంలో విధ్వంస చర్యలను ఖండిస్తున్నామని ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు అన్నారు. పర్యావరణ దినోత్సవం నాడు మొక్కల నాటి పర్యావరణానికి పచ్చదనమే పరిరక్షణ అని పేర్కొన్న ఎమ్మెల్యే ఎయిర్‌పోర్ట్ పేరుతో లక్షలాది వృక్షాలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఇది పర్యావరణ విధ్వంసం కాదా? అన్నారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ ఎం.గంగువాడలో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసుదేవ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ఈ ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ వద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు కార్యదర్శి జోగి అప్పారావు, ఉపాధ్యక్షులు లండ రామస్వామి, పెద్దలు పొట్టి ఎర్రయ్య, రాంపురం పంచాయతీ సర్పంచ్ పొట్టి ధర్మారావు, లోక ˇనాథం, పరశురాం, చలపతి, మర్ల సంతోష్, దున్న హరికృష్ణ, గుంటు రామస్వామి, జోగి రాజు, హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, రామకృష్ణ, యోగేష్, రైతులు పాల్గొన్నారు.



# విభిన్నంగా ఆలోచించాలి

**మెళియాపుట్టి, జూన్ 6 (వార్త):** చదువుతో పాటు సమాజంలో జరు గుతున్న అంశాలపై విభిన్నంగా ఆలోచించి. మేధాశక్తిని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారులు దేవేందర్ రావు, పద్మనాభం అన్నారు. మెళియాపుట్టిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, కాలాన్ని సద్వినియోగ పరుచు కుంటే దేన్నైనా సాధించగలమన్నారు. అనంతరం వారు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జేజేఎస్ ప్రతాప్, గ్రంథాలయధికారిణి అను రాధ, సహాయకురాలు హేమలత, రీడర్స్ శంకర్, మణి, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గాయపడిన ధర్మారావుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**మందస, జూన్ 6(వార్త):** మందసలోని సెగిడి వీధికి చెందిన నూకల ధర్మారావు ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. ఎడమకాలుకు సర్జరీ జరిగింది. ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.30 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కును ధర్మారావుకు ఎమ్మెల్యే శిరీష శుక్రవారం అందజేశారు.



# రైల్వే జోన్‌కు మరో ముందడుగు జీఎం నియామకం

**-ఎమ్మెల్యే కూన రవికుమార్**

**ఆమదాలవలస, జూన్ 6(వార్త):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మరో ముందడుగు పడిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ పనులు శర వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అందులో భాగంగా రైల్వే జోన్‌కు తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియ మించడం హర్షనీయమన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పరిపాలనా అనుమతులు పను లు వేగవంతం అయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. రైల్వే జోన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైల్వేజోన్ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. జోన్‌కు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీంతో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని. ప్రస్తుతం రైల్వే జోన్ పనులు తిరిగి ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పా రు. ఇప్పటికే 54 ఎకరాల భూమిని రైల్వే శాఖ కు అప్పగించడం జరిగిందని. జోన్ ఏర్పాటుతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విశాఖలోని ముడసరలోవ లో ఇప్పటికే స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలి పారు. రూ.149 కోట్ల వ్యయంతో 9 అంతస్తుల రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుంది. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధానమంత్రి , రైల్వే శాఖ మంత్రితో దఫదఫాలుగా చర్చలు జరిపి రైల్వే జోన్ ఏర్పాటుకు వేగం పెంచడం అయింది. గత 12 నెలల కాలంలో రూ.75 వేలకోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులు రూ.72 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తీసుకురావడం జరిగింద న్నారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధి చురుగ్గా సాగుతోంది. విశాఖ రైల్వే జోన్ పై గజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుంది. దీనివలన ఉత్తరాంధ్ర జిల్లాలకు మరింత అభివృద్ధి సూచికలు రానున్నాయని పేర్కొన్నారు.



# సిక్కోలులో ఘనంగా పీవీ సునీల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

**- మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు**

**- రక్తదానం చేసిన ఏఐమ్ సైనికులు, అభిమానులు**

**శ్రీకాకుళం, జూన్ 6(వార్త):** అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా, దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న దళితుల ధైర్యం పి.వి.సునీల్ కుమార్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిక్కోలు సైనికులు ముందుగానే సంబరాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న సునీల్ కుమార్ జన్మదినోత్సవం కాగా ముందస్తు గానే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం శ్రీకాకుళంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్య క్షులు తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబి రాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో ఏఐమ్ సైని కులు పాల్గొని స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. దళి తులు ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేస్తున్న పి.వి.సునీల్ కుమార్‌పై ఉన్న అభిమానాన్ని రక్తదాతలు చాటుకున్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన రక్తదాతలను ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను అభినందించారు. వారి సేవలను కొని యాడారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదాతలను ఉద్దేశించి తైక్వాండో శ్రీను మాట్లాడుతూ సునీల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేయడానికి అభిమా నులు స్వచ్ఛంధంగా ముందుకు రావడం అభినంద నీయమన్నారు. వేసవి కాలంలో రక్త నిల్వలు రక్తనిధి కేంద్రాలలో తక్కువగా ఉంటాయని అటువంటి పరిస్థితుల్లో రక్తదానం చేయడం వల్ల ఆ రక్తం ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐమ్ సైనికులు, సునీల్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




# గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు

మందస, జూన్ 6(వార్త): గ్రంథాలయాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాల యాలు విజ్ఞానానికి సోపానాలని మందస లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి అన్నారు. మందసలోని శాఖా గ్రంథా లయంలో నెల రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం విజయవంతమైంద న్నారు. విద్యార్థులు, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వ హించామన్నారు. ఈ సందర్బంగా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మందస పంచాయతీ ఈవో బమ్మిడి నవీన్ కుమార్, ఉపాధ్యాయుడు టి.జయరాం, వీఆర్వో శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్.మోహనరావు, యోగి, పాఠకులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



# జేసీని కలిసిన ముస్లిం సోదరులు




**ఆమదాలవలస, జూన్6(వార్త):** టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ముబారక్, ముస్లిమ్స్ సోదరులు శుక్రవారం జాయింట్ కలెక్టర్‌ని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బక్రీద్ పండుగ నిర్వహణకు సహకరించాలని కోరారు. ముస్లిం సోదరుల సూచనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. పండుగ ఆనందంగా జరుపుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇస్మాయిల్ అదాని షా, నాయకులు, రోషన్ బాషా, ప్రముఖ న్యాయవాది మీర్ అసదుల్లాలి ,రహూఫ్ ఖాన్ షేక్ అహ్మద్ తాజ్‌లి, నిజాం బహుదూర్ బాషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మెలియాపుట్టి, జూన్ 6 (వార్త):** రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలను రూపొందిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దపద్మపురంలో శుక్రవారం ఆయన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను గుర్తించి, పరి ష్కరిస్తామన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను, సబ్సిడీపై అందిస్తున్న వ్యవ సాయ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తల, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీకాంత్



**ఇచ్ఛాపురం, జూన్ 6(వార్త):** ఈనెల 6 నుంచి 8 వరకు వెస్ట్ బెంగాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీకాంత్ మహంతి ఎంపికయ్యారు. ఆయనకు డాక్టర్ గోమాత సురేష్ సహకారాన్ని అందించారు.

## ఆర్ఎంపీ మోహనరావు ఆకస్మిక మృతి



**మందస, జూన్ 6(వార్త):** మందస పట్టణంలోని కంచమయికాలనీకి చెందిన ఆర్ఎంపీ, వైసీపీ నాయకుడు గొవాడ మోహన రావు(49) ఆకస్మికంగా శుక్రవారం మరణించారు. గ్రామీణ వైద్యునిగా ఈ ప్రాంతంలో మోహనరావుకు ఎంతో మంచి పేరుంది.ఓ వైపు వైద్యునిగా ఉంటూ.. మరో వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేసేవారు. మేనకోడలిని దిగబెట్టడానికి విశాఖ వెళ్లిన ఆయన.. అక్కడే ఛాతిలో నొప్పితో అనారోగ్యానికి గురవ్వగా, బంధువులు ఆసుపత్రి తీసుకెళ్తుండగా దారిలో మరణించారు. మృతుడికి భార్య హేమలత, కుమారుడు జగదీష్, కుమార్తె పావని ఉన్నారు. మోహనరావు మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

## వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ



**ఇచ్ఛాపురం, జూన్ 6(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు దాటిన వారికి 7, 8వార్డుల టీడీపీ ఇన్‌చార్జి రంగాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాయ శ్రీనివాసరావు, డీలర్లు పొట్ట చంద్రావతి, యోగులు, జనసేన ఇన్‌చార్జి పటాన్ రుక్మిందర్ తదితరులు పాల్గొన్నారు.

## 17 కిలోల గంజాయితో ఒకరి పట్టివేత

**ఇచ్ఛాపురం, జూన్ 6(వార్త):** ఇచ్ఛాపురం రైల్వేస్టేషను వద్ద గంజాయితో ఒకరిని అరెస్టు చేసి, సుమారు కేజీ 17.450 గ్రాముల గంజాయిని ఇచ్ఛాపురం టౌను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాం జిల్లాకి చెందిన చబి సాహును టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు అదునులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం చిన్నంనాయుడు తెలిపారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546